# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-1 29, సెప్టెంబరు, 2014

అక్టోబర్ 8న కొమురం భీమ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ తరహాలో ఆదిలాబాద్ జిల్లాలో కొమురం భీమ్ నివసించిన జోడే ఘాట్ కేంద్రంగా టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కొమురం భీమ్ వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. కొమురం భీమ్ జల్, జంగల్, జమీన్ కోసం పోరాడాడని, అలాంటి గొప్ప వ్యక్తి చరిత్ర కూడా మన వాళ్లు తెలుసుకోలేనంతగా సమైక్య పాలనలో నిర్లక్ష్యం జరిగిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కొమురం భీమ్ అంటే ఎవరు? ఆయన చేసిన త్యాగాలు ఏంటి అనే విషయాలను ప్రపంచానికి తెలపాల్సిన బాధ్యత తమ ప్రభుత్వం పై వుందని ముఖ్యమంత్రి అన్నారు. జోడే ఘాట్‌ను టూరిస్టు స్పాట్‌గా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచ గిరిజన ఉత్సవాలు, భారతీయ గిరిజన సదస్సును కొమురం భీమ్ పేరిట నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లా తెలంగాణకు పై భాగంలో ఆకు పచ్చని అడవితో ఇండియాకు కాశ్మీర్ వున్నట్లే వుంటుందని, దానిని మరింత రమణీయంగా మార్చవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. కుంటాల జలపాతం, కవ్వాల్ ప్రాజెక్టు లాంటివి ఇప్పటికే వున్నాయని మరింత శ్రద్ధ పెట్టి ఆదిలాబాద్ జిల్లాను తీర్చిదిద్దాలని చెప్పారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు విమాన సౌకర్యం కూడా కల్పిస్తామని, రోడ్డు రవాణాను కూడా మెరుగుపరుస్తామని వెల్లడించారు. కొమురం భీమ్ పుట్టి పెరిగిన ప్రాంతంలోనే గిరిజన యూనివర్సిటి నెలకొల్పే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. కొమురం భీమ్ జీవిత విశేషాలతో ఒక డాక్యుమెంటరీ రూపొందించాలని అధికారులను కోరారు. కొమురం భీమ్ స్మారకార్థం సుమారు 200 ఎకరాలు సేకరించి కొమురం భీమ్ మెమెరియల్ స్థాపిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అక్టోబర్ 8న ఆ మెమోరియల్‌కు తానే శంఖుస్థాపన చేస్తానని కూడా ప్రకటించారు.

సమావేశంలో ఐటి శాఖ మంత్రి కెటి.రామారావు, ప్రభుత్వ సలహాదారు కెవి.రమణాచారి, జయధీర్ తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం